# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.
2. రాష్ట్రంలో 310 కోట్ల రూపాయల నిధులతో సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.
3. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.
4. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను ఎరువులుగా మార్చి, రాష్ట్రాన్ని స్వచ్ఛంగా మార్చనున్నట్టు స్వర్ణాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ పేర్కొన్నారు.
5. రాఖీ పండుగను ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

==========================

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలను కూటమి ప్రభుత్వం సృష్టిస్తోందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడవి బిడ్డలకు సౌకర్యాలన్నీ అందేలా అడవి తల్లి బాట అడుగులు వేస్తోందని చెప్పారు.

--------------------------

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా పాడేరు మండలంలోని వంజంగి గ్రామంలో వనదేవతల ఆలయాన్ని ముఖ్యమంత్రి ఈ ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కాఫీ తోటలను పరిశీలించి, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు.

--------------------------

రాష్ట్రంలో 310 కోట్ల రూపాయల నిధులతో సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఆయన ఈరోజు ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలు, విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి వివరిస్తూ..

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం తగిన నిధులు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాజులూరు మండలం బందనపూడి గ్రామంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, 21 లక్షల 80 వేల రూపాయలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. సంవత్సర కాలంలోనే 125 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేశామని వివరించారు.

---------------------------

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 18 మంది లబ్దిదారులకు 24 లక్షల రూపాయల చెక్కులు అందజేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4 వందల కోట్ల రూపాయలు లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు.

---------------------------

అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రక్షా బంధన్ సోదరులు సోదరీమణుల మధ్య దృఢమైన బంధానికి ప్రతీక అని, ఈ పండుగ వారి బంధాన్ని బలోపేతం చేస్తుందని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం, భద్రత, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ అని అన్నారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను, దేశ భక్తిని పెంపొందించేందుకు “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి సంబంధిత సెల్ఫీలను www.harghartiranga.com వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయడం, తిరంగా బైక్ ర్యాలీలు, విద్యార్థులకు తిరంగా రంగోలి, తిరంగా రాఖి తయారీ వంటి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి భారతీయునిలో దేశ భక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను ఎరువులుగా మార్చి. రాష్ట్రాన్ని స్వచ్ఛంగా మార్చనున్నట్లు స్వర్ణాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఈరోజు ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ - స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు పట్టాభిరామ్ తెలిపారు.

వాయిస్ 28 సెకన్లు

---------------------------

ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని, అంకితభావంతో దేశాభివృద్ధికి కృషి చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం వద్ద హర్ ఘర్ తిరంగా క్యాండిల్ లైట్ కార్యక్రమం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడు తమ ఇళ్ల పైన జాతీయ జెండాను ఎగురవేసి, దేశ భక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమ నిర్వహణలో ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాకిచెర్ల వద్ద ఈరోజు రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పిడుగురాళ్ల నుంచి తిరుమల దర్శనానికి వెళ్తుండగా వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి వైద్య అధికారులను ఆదేశించారు.

---------------------------

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీని ప్రభావంతో ఈనెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపడీనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావ్ తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

---------------------------

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 క్రికెట్ పోటీలలో భాగంగా కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ మధ్య నిన్న మ్యాచ్ విశాఖపట్నంలో జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కాకినాడ కింగ్స్ నిర్ణీత ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. వర్షం కారణంగా అంపైర్ల 14 ఓవర్‌లకు 173 పరుగులుగా లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన అమరావతి రాయల్స్ 13.2 ఓవర్‌లకు 173 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈరోజు విజయవాడ సన్ షైనర్స్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్ల మధ్య మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాలకి మ్యాచ్ ప్రారంభం కానుంది.

====================